వ్యాపారుల చేతుల్లో అన్నదాతలు విలవిల!

- రోజురోజుకు తగ్గిస్తున్న గిట్టుబాటు ధర
- మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలంటున్న రైతులు

మొక్క జొన్న రైతులను వ్యాపారులు దగా చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని చౌక ధరకే కొట్టేస్తున్నారు. రోజురోజుకు ధర తగ్గిస్తూ ధర గిట్టుబాటు కాకుండా దోచేస్తున్నారు. కొంతకాలం క్రితం వరకు మొక్కజొన్న క్వింటాలు రూ.2,800లు పలికింది. ధాన్యం రైతుల చేతికందే సరికి వ్యాపారులు కుమ్మక్కై రోజురోజుకు తగ్గించేస్తున్నారు. ప్రస్తుతం క్వింటాలు మొక్కజొన్న రూ.1,900కు మించడం లేదు. మద్దతు ధర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తుండటంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. – జూపాడుబంగ్లా

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభమైన జూన్ మొదటి వారంలోనే ఆశించిన వర్షాలు కురవటంతో రైతులు విరివిగా మొక్కజొన్న పంటను సాగుచేశారు. పంట చేతికందే సమయంలో అధికవర్షాల వల్ల పంటలు దెబ్బతినటంతో ఎకరాకు కేవలం 15 నుంచి 20 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. పంటల నూర్పిడి చేసినప్పటి నుంచి వర్షాలు కురుస్తుండటంతో చేతికందిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎకరాకు రూ.20 వేల చొప్పున ముందస్తు కౌలు చెల్లించి ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టి మొక్కజొన్న పంటలు సాగుచేస్తే 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి రాగా గిట్టుబాటు కాని ధరలకు ధాన్యాన్ని విక్రయించి ఎలా అప్పులు తీర్చుకోవాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారుల కుమ్మక్కు..

ఇరవైరోజుల క్రితం క్వింటాలు మొక్కజొన్న ధర రూ.2,800ల ధర పలకగా ధాన్యం చేతికందుతుండగానే వ్యాపారులు కుమ్మక్కై పూర్తిగా తగ్గించేశారు. ప్రస్తుతం క్వింటాలు మొక్కజొన్నల ధర రూ.1,900లకు మించడం లేదు. ప్రభుత్వం మద్దతు ధర రూ.2,400 ప్రకటించినా వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. నాలుగైదు రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ధాన్యాన్ని కాటా వేసినప్పటికీ సకాలంలో వ్యాపారులు డబ్బు చెల్లించకుండా నెలలు తరబడి తిప్పుకొంటున్నారని రైతులు పేర్కొంటున్నారు.



ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు

గిట్టుబాటు ధరలు కల్పించాలి



ఎకరాకు రూ.20 వేల చొప్పున ముందస్తు కౌలు చెల్లించి 25 ఎకరాలను కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగుచేశాను. ఎకరాకు రూ.40వేల వరకు పెట్టుబడి అయ్యింది. అధిక వర్షాల వల్ల దిగుబడులు తగ్గిపోయాయి. ఎకరాకు 15 క్వింటాళ్లకు మించి రాలేదు. ప్రభుత్వం క్వింటం మొక్కజొన్నలకు రూ.2,400లు మద్దతు ధర ప్రకటించినా వ్యాపారులు మాత్రం రూ.1,900లకే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వమే స్పందించి గిట్టుబాటు ధరకు కొనేలా వ్యాపారులను ఆదేశించాలి.

– మధు, రైతు, జూపాడుబంగ్లా

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి



నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాను. అధికవర్షాల వల్ల దిగుబడి తగ్గింది. చేతికందిన అరకొర పంటను అమ్ముకుందామంటే వ్యాపారులు ధర తగ్గించి అడుగుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400ల చొప్పున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ఆదుకోవాలి.

– రాఘవయ్య, రైతు, జజూపాడుబంగ్లా

కొనుగోలు కేంద్రాలకు రెఫర్ చేస్తాం

ప్రభుత్వం క్వింటం మొక్కజొన్నలకు రూ.2,400ల మద్దతు ధర ప్రకటించింది. బహిరంగ మార్కెట్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నందున విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయటానికి ప్రతిపాదనలు పంపిస్తాం.

– కృష్ణారెడ్డి, ఏఓ, జూపాడుబంగ్లా

క్లుప్తంగా

బోధనేతర కార్యక్రమాలతోనే విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా నాయకులు

నందికొట్కూరు: బోధనేతర కార్యక్రమాలతోనే విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శి ముర్తుజావలి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని ఓ భవనంలో యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, గూగల్ లింక్ ఫారమ్స్, డేటా అప్ లోడ్, యోగ దినోత్సవాలు, మెగా పేరెంట్ మీటింగ్‌లు, కర్మయోగి, స్వచ్ఛ ఆంధ్రా-స్వర్ణాంధ్ర, లీడర్ షిప్ ట్రైనింగ్‌లు, బబ్లింగ్ మిడ్డేమిల్స్, గుడ్లు, చిక్కీలు, జీఎస్టీపైన వ్యాసరచన పోటీలు, రికార్డులు, రిజిస్టర్లు తదితర పనులతో ఉపాధ్యాయులు ఉక్కిరి బిక్కిరవుతున్నారన్నారు. బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు రాముడు, వాసు, రంగస్వామి, జగదీష్, సురేంద్ర, మధు, మనోహర్, నాగేశ్వరరావు, మునీంద్ర పాల్గొన్నారు.

ఆత్మకూరులో మోస్తరు వర్షం



ఆత్మకూరులో కురుస్తున్న వర్షం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణం, మండలంలో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రోడ్లు, కాలువలు జలమయమయ్యాయి. వర్షం రాకతో మొక్కజొన్న రైతులు ఆందోళన చెందారు. పంట చేతికొచ్చే సమయంలో వర్షం రావడంతో మొక్కజొన్న కంకి దెబ్బతింటుందని, వరుణుడు శాంతిస్తే మొక్కజొన్న పంట దిగుబడి బాగుంటుందని రైతులు ఆశిస్తున్నారు.

ఇంటిపై పిడుగు

- త్రుటిలో తప్పిన ప్రమాదం

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామానికి చెందిన గోవర్ధనయ్య ఇంటిపై గురువారం సాయంత్రం పిడుగు పడింది. పిడుగు ధాటికి ఇంట్లోని ఫ్యాన్లు, టీవీ, ఏసీలు పాడయ్యాయి. ఆ సమయంలో కుటుంబసభ్యులు పక్కగదిలో ఉండటంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు.

ప్రాణాలు పోతున్నా మారరా?

జూపాడుబంగ్లా: పక్షం రోజుల క్రితం ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదం జరిగి ఒకరు మృతిచెందగా 20 మంది గాయపడిన ఘటన మండలంలోని తంగడంచ చెక్‌పోస్టు సమీపంలో చోటుచేసుకుంది. అయినా ఆటో డ్రైవర్లు, వ్యవసాయ కూలీలు మారడం లేదనే విమర్శలున్నాయి. కడుపుతిప్పల కోసం వ్యవసాయ పనులకు వెళ్లే కూలీల నుంచి ఆటో డ్రైవర్లు రూ.50 నుంచి రూ.100 చార్జీ తీసుకుని పరిమితికి మించి ఎక్కించుకుని పొలాలకు తరలిస్తున్నారు. ఆరుగురిని కూర్చోబెట్టుకోవాల్సిన ఆటోలో 20 నుంచి 30 మంది దాకా వ్యవసాయ కూలీలను ఎక్కించుకుంటుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కనీసం పోలీసులైనా ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకుని, వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

3వ రోజు నిరసన




నిరసన తెలుపుతున్న బాధితులు

దొర్నిపాడు: వెల్త్ అండ్ హెల్త్ ఫైనాన్షియల్ సొల్యుష్యన్స్ బాధితుల నిరసన గురువారం మూడో రోజుకు చేరింది. స్థానిక ప్రధాన రహదారిపై బాధిత మహిళలు, పురుషులు కూర్చొని తమకు న్యాయం చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. బాధితుడు తేజ మాట్లాడుతూ ఒక్కొక్కరి నుంచి రూ.3.50 లక్షలు దండుకుని ఉద్యోగాలు చూపకుండా బోర్డు తిప్పేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తమకు ఉద్యోగాలు వద్దని, డబ్బు తిరిగి ఇవ్వాలన్నారు. ఇళ్లు, బంగారు నగలు తాకట్టు పెట్టి నగదు తెచ్చామన్నారు. ప్రభుత్వం వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుని మోసపోయిన తమకు న్యాయం చేయాలని కోరారు.

యువకుడికి తీవ్ర గాయాలు

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన బోడెద్దుల అంజి, మరికొందరు బస్సులో మోదీ సభకు శ్రీశైలం వెళ్లారు. తిరుగుప్రయాణంలో భాగంగా ఆర్టీసీ బస్సు శిఖరం సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద ఎగిరేయడంతో వెనుక కూర్చున్న అంజి తలకు, వెన్నెముక ప్రాంతంలో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

గ్రంథాలయాల్లో సౌకర్యాలు కరవు



గ్రంథాలయంలో పుస్తకాలను చదువుతున్న నిరుద్యోగులు

- ప్రైవేట్ భవనాల్లో నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులు

నందికొట్కూర్: విజ్ఞానాన్ని పెంపొందించి గ్రంథాలయాలను సమస్యలు వెంటాడుతున్నాయి. పొలిక వసతులు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని ఏ ఒక్క మండలంలోనూ గ్రంథాలయానికి సొంత భవనం లేదు. అరకొర ఉన్న ప్రైవేట్ భవనాల్లోనే గ్రంథాలయాలు నడుపుతున్నారు. రూ.వేలల్లో బాడుగలు చెల్లించినా పాఠకులకు సరైన సౌకర్యాలు సమకూర్చలేకపోతున్నారు. నందికొట్కూరు గ్రంథాలయానికి బోర్డు కూడా రాయించలేని స్థితిదాపురించింది. వర్షాకాలం వస్తే పాఠకులకు మరింత ఇబ్బందికరంగా ఉంటోంది. కనీసం సరైన కుర్చీలు కూడా ఉండటం లేదు. నందికొట్కూరు గ్రంథాలయంలో 14,600 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. రోజుకు 250 నుంచి 300 వరకు పాఠకులు లైబ్రరీకి వస్తుంటారు. వీటిని చదివి ఎందరో నిరుద్యోగులు ఉద్యోగాలు సంపాదించారు. పగిడ్యాల, మిడుతూరు, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో ఉన్న గ్రంథాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయడంతోపాటు ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

సొంత భవనం నిర్మించాలి



గ్రంథాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి. గ్రంథాలయ చైర్మన్ మల్లికార్జునరెడ్డి అనేక సార్లు స్థల పరిశీలన చేశారు. పుస్తకాలు ఉన్నా చదవడానికి స్థలం లేదు. ఇరుకైన గదులు ఉండడంతో నిలబడటానికి కూడా స్థలం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించాలి.

– వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

నంద్యాల(న్యూటౌన్): వచ్చే నెల 17, 18 తేదీల్లో బేతంచెర్లలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏసురత్నం అధ్యక్షతన జిల్లా మహాసభల జయప్రదానికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పు చేస్తూ పని గంటలు పెంచుతూ కార్మిక వర్గాని తీవ్రంగా మోసం చేసిందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్ఐసీ, బ్యాంకు, రైల్వే, పోర్టులు, కేంద్ర గిడ్డంగి సంస్థలు, ప్రైవేటుకు అప్పజెబుతూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేశారన్నారు. ఏళ్ల తరబడి కేంద్ర ప్రభుత్వ స్కీంలో పని చేస్తున్న అంగన్‌వాడీ, ఆశా, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, వైద్య రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కనీస వేతనాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి నేతలు విస్మరిస్తున్నారన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు తోటమద్దులు, గౌస్, లక్ష్మణ్, బాలవెంకట్, వెంకటలింగం, ఎల్లయ్య, రాంనాయక్, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

మోదీజీ.. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపండి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నంద్యాల(అర్బన్): మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరిస్తే పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వైఎస్సార్‌సీపీ నాయకులు ప్లకార్డుల ద్వారా విన్నవించారు. కర్నూలులో గురువారం కూటమి ప్రభుత్వం నిర్వహించిన బహిరంగ సభ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు సాయిరాంరెడ్డి, నరసింహ, సాయి, గిరీష్, శివలు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతపురంలోని ఆర్‌డీటీకి ఫారిన్ నిధుల విడుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కల్తీ మద్యం స్కాంను సీబీఐకి అప్పగించి నిందితులను కఠినంగా శిక్షించి పేద ప్రజల ప్రాణాలు కాపాడాలన్నారు.

మోదీ హెలికాప్టర్‌లోనే సీఎం, డిప్యూటీ సీఎం రాక

- హెలిప్యాడ్ల నిర్మాణ వ్యయం వృథా
- మోదీ రోడ్డుషో లేకపోవడంతో ప్రజలు నిరాశ



ప్రధానమంత్రి నరేంద్రమోదీ కారులో నుంచి బయటకు రాకపోవడంతో నిరాశలో ఉన్న ప్రజలు

శ్రీశైలంటెంపుల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం శ్రీశైలం పర్యటనలో కొన్ని అనుకోని ఘటనలు చోటుచేసుకున్నాయి. 20 రోజుల క్రితం ప్రధాని శ్రీశైలం పర్యటన ఖరారైంది. ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించింది. జిల్లా ఉన్నతాధికారులు శ్రీశైలంలోనే తిష్టవేసి ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏర్పాట్లలో భాగంగా రాష్ట్ర గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం, ప్రధాని వేర్వేరు హెలికాప్టర్లలో వస్తారని నిర్ణయించుకుని అందుకు అనుగుణంగా సున్నిపెంటలోని ఎకోలాజికల్ పార్క్‌లో మూడు హెలిప్యాడ్‌లను సిద్ధం చేశారు. అక్కడ ఒక హెలిప్యాడ్ ఉంది. మరో రెండు హెలిప్యాడ్‌లను నూతనంగా సిద్ధం చేశారు. ప్రాజెక్టు ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో నూతనంగా మరో మూడు హెలిప్యాడ్‌లను సిద్ధం చేశారు. హెలిప్యాడ్‌లతో పాటు అక్కడ విద్యుత్‌లైట్లు, జంగిల్ క్లియరెన్స్, గ్రౌండ్ చదును తదితర పనులకు రూ.కోట్లలో ఖర్చు అయినట్లు సమాచారం. అయితే గవర్నర్ రాకపోగా, సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రధాని హెలికాప్టర్‌లోనే రావడంతో మూడు హెలిప్యాడ్‌లకు చేసిన ఖర్చు వృథా అయింది. అలాగే శ్రీశైల ఆలయంలో శ్రీశైల జగద్గురు పీఠ సింహాసనం ఉంది. అక్కడ శ్రీశైల జగద్గురు పీఠాధిపతి పండితారాధ్య శివాచార్య మహాస్వామి ఉన్నారు. ప్రధాని పర్యటన తెలుసుకుని మూడు రోజుల ముందుగానే పీఠాధిపతి పీఠానికి చేరుకున్నారు. ప్రధాని ఆలయ సందర్శనకు వచ్చినప్పుడు పీఠాన్ని సందర్శిస్తారని పీఠాధిపతి ఆశించారు. కానీ ప్రధాని పీఠాన్ని సందర్శించకపోవడంతో పీఠాధిపతి విస్మయానికి గురయ్యారు. ప్రధాని నంది మండపం నుంచి గంగాధర మండపం వరకు కారుపై నుంచి రోడ్డుషో ద్వారా ప్రజలకు అభివాదం చేసుకుంటూ వెళ్తారని భావించిన ప్రజాప్రతినిధులు తదనుగుణంగా నియోజకవర్గం నుంచి ప్రజలను తరలించారు. సుమారు 5వేలకు పైగా జనాలను తరలించారు. పైగా మహిళలకు కాషాయ రంగు చీరలు సైతం ఉచితంగా అందించినట్లు సమాచారం. పురుషులు తెల్ల పంచె, చొక్కా వేసుకుని రావాలని, వారి ఆధార్‌కార్డులను సైతం తీసుకుని పాసులిచ్చారు. అయితే ప్రధాని కారు నుంచి బయటికి రాకుండా, కారులోనే ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు వెళ్లడంతో ప్రజలు నిరాశ చెందారు.

ప్రధాని మోదీ నోట మహానంది మాట

మహానంది: 'మహానంది కే శ్రీ మహానందీశ్వర స్వామికో ప్రణామ్ కర్తాహు' అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రస్తావించడం ఆలయ విశిష్టత, చరిత్ర ఎంతటి గొప్పదో తెలుస్తుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలులో గురువారం జరిగిన జీఎస్టీ సభలో ఆయన మాట్లాడుతూ మహానంది, అహోబిలం, మంత్రాలయం ఆలయాల్లో కొలువైన శ్రీ అహోబిల నరసింహస్వామి, శ్రీ రాఘవేంద్ర స్వామిలకు నమస్కరించడం పట్ల ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వామపక్ష నాయకుల అక్రమ అరెస్ట్ తగదు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర అభివృద్ధిని మరిచి అప్పుల ఊబిలో కూరుకొని పోయేలా చేసిన మోడీ పర్యటనపై విమర్శలు చేసిన వామపక్ష పార్టీల నాయకులను అక్రమ అరెస్టులు చేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు మోడీ అమరావతికి నీళ్లు, మట్టి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. రూ.11వేల కోట్లు ఇస్తామని చెప్పి అప్పు రూపంలో ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రానికి నిధులు ఇవ్వాలని, విభజన హామీలను నెరవేర్చాలని చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో అక్రమ అరెస్టులు చేయడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతతే అన్నారు. రాష్ట్రానికి నిధులు కేటాయించాలని, విభజన హామీలను అమలు చేయాలని ప్రధాని మోడీ స్పష్టమైన వైఖరి తెలుసుకోవాలని అడిగేందుకు వెళితే అనుమానంతో పోలీసులు పార్టీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు.

మోదీ పర్యటనతో ప్రయోజనం శూన్యం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాలుగు సార్లు వచ్చినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతోపాటు కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదా ఊసే ప్రధాని ఎత్తలేదంటే ఆంధ్రప్రదేశ్‌పై ఎంత ప్రేమ ఉందో ప్రజలు గమనించాలన్నారు. వెనుకబడిన జిల్లాలకు ఏటా రూ.50 కోట్ల చొప్పున నిధులు ఇస్తామని, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని చెప్పి 12 ఏళ్ల క్రితం ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. విభజన హామీల ప్రస్తావన సభలో పీఎం ఎందుకు ఎత్తలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హామీలు అమలు చేయాలని ప్రజల పక్షాన నిరసనలు తెలిపే నాయకులను అరెస్ట్ చేయించడం సబబు కాదన్నారు.

అలరించిన భజన



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై అనంతపురానికి చెందిన చెన్నారెడ్డి, బృందం వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. గణేశప్రార్థన, శివ శివ శంకరా, అరుణాచలశివ, లింగాష్టకం, శ్రీశైలం శివమయం, పార్వతీరమణ, మహేశాగౌరీశా, నల్లమల కొండలలో మొదలైన భక్తిగీతాలను, భజన కీర్తనలను చెన్నారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, పుల్లారెడ్డి, నాగేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, జనార్ధనరెడ్డి, శంకరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఆలపించారు.

నేటి నుంచి శివరామస్వామి ఆరాధనోత్సవాలు

నంద్యాల(అర్బన్): మండలం మిట్నాల గ్రామంలో వెలసిన అవధూత శివరావ ఎస్వామి ఆరాధనోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతా యని పురోహితులు గడియారం ప్రభాకర్ శర్మ గురువారం తెలిపారు. మిట్నాల, జిల్లెల్ల గ్రామస్తుల సహకారంతో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు రుద్రాభిషేకాలు, పుష్పాభిషేకాలతో పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అత్యంత వైభవంగా జరిగే ఈ ఆరాధన మహోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

నూతన ఉపాధ్యాయులకు స్వాగతం



నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతున్న సంఘం నాయకులు

ఆత్మకూరు: నూతన ఉపాధ్యాయులకు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆత్మకూరు డివిజన్ నాయకులు గురువారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండల శాఖ అధ్యక్షులు అస్లాం, జిల్లా ఆర్థిక కార్యదర్శి శివప్రసాద్, రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ ఆర్.గోవిందు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న తీవ్ర ఉపాధ్యాయ కొరతను తీర్చినప్పుడే పాఠశాల స్థితిగతులు బాగుపడతాయన్నారు. నూతన ఉపాధ్యాయులకు తమ సంఘం అండగా ఉంటుందన్నారు.